# పార్టీ కార్యకర్తలే నా బలం.. బలగం




సోమేశ్వర్ గ్రామంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

- అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి చరిత్ర సృష్టిస్తా...
- సర్వేల ప్రకారం భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయం
- బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశంలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 20 : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలే నా బలగం.. బలం అని, అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి చరిత్ర సృష్టిస్తానని రాష్ట్ర శాసనసనభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బాన్సువాడ మండలంలోని సోమేశ్వర్ గ్రామ సమీపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బూత్‌ల వారీగా బూత్ లెవల్ నాయకులు, కార్యకర్తలు చేపట్టాల్సిన కార్యక్రమాలపై బోర్డుపై క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో తొమ్మిది సంవత్సరాల కాలంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం రూ. 10 వేల కోట్ల నిధులు తీసుకొచ్చి, బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా అఖండ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని జోస్యం చెప్పారు. నియోజకవర్గంలో 258 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, ప్రతి పోలింగ్ బూత్‌కు ఇద్దరిని ఇన్‌చార్జిలుగా నియమించినట్లు చెప్పారు. ప్రజలకు బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోను వివరించి చెప్పాలన్నారు. మ్యానిఫెస్టో కరపత్రం ప్రతి ఇంటికీ చేరాలన్నారు. ప్రతి ఒక్క ఓటరు ఓటు వేసేలా అందరిని పోలింగ్ బూత్‌కు తీసురావాలని సూచించారు. ప్రజలు కోరుకుంటున్నట్లు అసైన్డ్ భూములపై రైతులకు హక్కులు ఇచ్చి అమ్మడానికి, కొనడానికి మార్పులను రైతులకు వివరించాలని చెప్పారు. నియోజకర్గంలో మొత్తం 258 బూత్‌లు ఉండగా, 1.92 లక్షల మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. సాగు నీటి రంగం అభివృద్ధి కోసం రూ. వేయి కోట్లు, రోడ్ల అభివృద్ధికి రూ. వేయి కోట్లు, మిషన్ భగీరథకు రూ. 500 కోట్లు, విద్యకు రూ.400 కోట్లు, వైద్యానికి రూ. 200 కోట్లు, విద్యుత్‌కు రూ. 250 కోట్ల చొప్పున ఖర్చు చేశామని చెప్పారు. మనం చేసిన అభివృద్ధి, సేవలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. సర్వే ప్రకారం బాన్సువాడ నియోజకవర్గంలో 76 శాతం ప్రజలకు బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఉందన్నారు. ఆరు నెలల క్రితం 62 శాతం ప్రజామోదం ఉండగా, ఇప్పుడు 76 శాతానికి పెరిగిందన్నారు. రెండో స్థానంలో ఉన్నవారికి కేవలం 21శాతం మాత్రమే ప్రజల ఆదరణ ఉన్నట్లు సర్వేలో తేలిందని చెప్పారు. ఈ నెల 30న లక్ష మందితో బాన్సువాడ పట్టణంలో మధ్యాహ్నం 2గంటలకు సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఉంటుందని, ఈ సభను విజయంతం చేయాలని కోరారు. నవంబర్ 4న బాన్సువాడ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా తాను నామినేషన్ వేయనున్నట్లు స్పీకర్ చెప్పారు. సన్నాహక సమావేశంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి, బాన్సువాడ నియోజకవర్గంలోని తొమ్మిది మండలాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, బీఆర్ఎస్ పార్టీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తను అభినందించిన స్పీకర్



బాన్సువాడ రూరల్, అక్టోబర్ 20 : బాన్సువాడ మండలంలోని కొయ్యగుట్టకు చెందిన పండరిగౌడ్ మా ఓటు బీఆర్ఎస్ పార్టీకి, మా కుటుంబం మద్దతు పోచారం శ్రీనివాసరెడ్డికే.. ఇతర పార్టీల వారు దయచేసి ఓటు అడగడానికి మా ఇంటికి రాకండి అంటూ విన్నూత్న రీతిలో తన ఇంటి గోడకు ఫ్లెక్సీని ఏర్పాటు చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన ఈ వార్త 'నమస్తే తెలంగాణ'లో శుక్రవారం ప్రచురితం అయ్యింది. సోమేశ్వర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సన్నాహక సమావేశంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి తన ఫోనులో వార్త క్లిప్పింగ్‌ను స్పీకర్‌కు చూపించగా, తనపై అభిమానం చాటుకున్న పండరిగౌడ్‌ను వేదికపైకి పిలిచి ధన్యవాదాలు తెలుపుతూ అభినందించారు.

# అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ కాంగ్రెస్

- రాహుల్ పప్పు అనడంలో తప్పేలేదు
- కాంగ్రెస్‌ది కుటుంబ పాలన కాదా ?
- అది.. జాతీయ పార్టీనా...ప్రాంతీయ పార్టీనా..
- రాహుల్‌గాంధీపై మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఫైర్



మోర్తాడ్, అక్టోబర్20: 'పాడిందే పాడరా...పాసుపండ్ల దాసిగా అన్న తీరుగా ఉంది రాహుల్‌గాంధీ వైఖరి. ఇక్కడి కాంగ్రెస్ సన్నాసులు రాసిచ్చిన స్క్రిప్ట్‌నే చదువుతూ తన అజ్ఞానాన్ని ప్రదర్శిస్తున్నాడని.. రాష్ట్రరోడ్లు భవనాలు, గృహనిర్మాణశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. తాత నెహ్రూ, నానమ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్‌గాంధీ, తల్లి సోనియాగాంధీ పేరు చెప్పుకుంటూ... కేసీఆర్‌ది కుటుంబపాలన అని మాట్లాడుతు న్న రాహుల్‌గాంధీని పప్పు అని అనడంలో తప్పేమిలేదని అన్నారు. నీది జాతీయ పార్టీనా.. ప్రాంతీయ పార్టీనా.. రాష్ట్రానికో విధానం, రాష్ట్రానికో మ్యానిఫెస్టో ఉంటదా అని శుక్రవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. రాష్ట్రానికో మ్యానిఫెస్టో ప్రకటిస్తున్న కాంగ్రెస్ తన మోసపూరిత వైఖరిని ఇక్కడే బయటపెట్టుకుంటున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు ఛత్తీస్‌గఢ్‌లో రూ.500, రాజస్థాన్‌లో రూ.750, కర్ణాటకలో రూ.1000 మాత్రమే పింఛన్లు ఇస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మొదట రూ.4వేల పింఛన్లు ఇచ్చి తర్వాత తెలంగాణ ప్రజలకు ఇస్తామని చెప్తే ప్రజలు నమ్ముతారని, అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయకుండానే ఇక్కడ ఇస్తామని చెప్తే నమ్ముతారా అని ప్రశ్నించారు. రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2000 చేసిన ఘనత కేసీఆర్‌దని, ఇప్పుడు మ్యానిఫెస్టోలో రూ.5వేలు ఇస్తామని చెప్పిండు బరాబర్ చేస్తాడు అన్ని మంత్రి పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, రైతుబంధు, రైతుబీమా, 24గంటల ఉచిత విద్యుత్, రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రభుత్వ దవాఖానల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం, నూతన పరిశ్రమలకు పెట్టుబడుల వెల్లువ, యువతకు లక్షల ఉద్యోగాల కల్పన, ప్రపంచస్థాయి ప్రశంసలు ఇలా అన్ని రంగాల్లో తెలంగా ణ అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. ఇది తెలుసుకొని రాహుల్ మాట్లాడాల ని హితవు పలికారు. అవినీతి గురించి కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ మాట్లాడితే అవినీతి అనే పదమే సిగ్గుపడుతుందని, దేశంలో కాంగ్రెస్ చేయని స్కాము ఏదైనా ఉంటే ఒక్కటి చెప్పాలని, కాంగ్రెస్ అంటేనే అవినీతి..కుంభకోణాలని ఎద్దేవా చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో 60 ఏండ్ల కాంగ్రెస్ పాపాలను కడిగామని మంత్రి అన్నారు. రూ.80వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మిస్తే లక్షకోట్ల అవినీతి ఎలా జరిగింది రాహుల్ గాంధీ, ఇది స్క్రిప్ట్ కాకపోతే మరేంటి అని ప్రశ్నించారు. తెలంగాణను అన్ని రకాల అరిగోస పెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని, 1956లో తెలంగాణను ఆంధ్రలో కలిపి తెలంగాణకు తీరని అన్యాయం చేశారని, తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన అన్ని హక్కులను కాంగ్రెస్ పార్టీ కాలరాసిందన్నారు. 1969లో తెలంగాణ కోసం ఉద్యమిస్తే 300 మంది తెలంగాణ బిడ్డలను కాల్చి చంపింది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. 2004లో టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుని తెలంగాణ రాష్ట్రం ఇస్తామని సీఎంపీలో పెట్టి మోసం చేస్తే వందల మంది తెలంగాణ బిడ్డలు ప్రాణాలు తీసుకున్నారని, ఇంకా ఏ ముఖం పెట్టుకుని తెలంగాణ ప్రజలను గ్యారెంటీల పేరుతో ఓట్లు అడుగుతున్నావని నిలదీశారు. ధరణి పోర్టల్ గురించి రాహుల్‌గాంధీకి కనీస అవగాహన లేదని, లంచాలు, దళారీ వ్యవస్థ నుంచి రైతులు విముక్తులైతే ధరణి నచ్చుత లేదా.. అని ప్రశ్నించారు. మండుటెండల్లో చెరువుల అలుగు పారుతుంటే, నిండిన చెరువుల్లో చేపపిల్లలు చెంగుచెంగున ఎగురుతుంటే మా మత్స్యకారుల సంబురం నచ్చుతలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ లోపాయికారి ఒప్పందం ప్రజలకు అర్థమైందని, దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో సహకరించుకున్న తీరు మరచిపోరని అన్నారు. కాంగ్రెస్ మాటలు నమ్మితే 60ఏండ్లు వెనక్కిపోతామని, తెలంగాణను ముంచిన కాంగ్రెస్ కావాల....! తెలంగాణను సుభిక్షం చేసిన కేసీఆర్ కావాలా ప్రజలు ఆలోచన చేయాలన్నారు.

## వేములను పరామర్శించిన శాసనసమండలి చైర్మన్ గుత్తా



వేములను పరామర్శిస్తున్న మండలి చైర్మన్ గుత్తా

వేల్పూర్, అక్టోబర్ 20: మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ ఇటీవల మృతి చెందారు. శుక్రవారం మంత్రి వేములను వేల్పూర్‌లోని ఆయన నివాసంలో రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఎంఎస్.ప్రభాకర్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి, ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కుర్మాచలం, బుద్ధవనం ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధు శేఖర్, బంధుమిత్రులు శ్రేయోభిలాషులు పరామర్శించారు. ఈ సందర్భంగా మంజులమ్మ చిత్రపటానికి వారు పుష్పాంజలి ఘటించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మంత్రి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ముమ్మరంగా వాహనాల తనిఖీ

**పలు ప్రాంతాల్లో రూ.23,92,800 స్వాధీనం**

శక్కర్‌నగర్/కామారెడ్డి/బాన్సువాడ రూరల్, అక్టోబర్ 20: ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం, ఇతర వస్తువులను అక్రమంగా తరలించకుండా పోలీసులు, అధికారులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. శుక్రవారం పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి, ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.23,92,800 స్వాధీనం చేసుకున్నారు. బోధన్ పోలీస్ సర్కిల్ పరిధిలోని సాలూరా మండల కేంద్రం శివారులోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద అంబులెన్స్‌లో తరలిస్తున్న నగదును పోలీసులు సీజ్ చేశా రు. బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ సిబ్బందితో కలిసి తనిఖీ తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి వస్తున్న అంబులెన్స్‌ను సాలూరా చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేయగా అందులో రూ. 5,11,400 నగదు లభ్యమైందని పోలీసులు తెలిపారు. ఈ డబ్బులకు ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేయడంతోపాటు డబ్బులను తరలిస్తున్న పవన్‌కుమార్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. రూరల్ సీఐ శ్రీనివాసరాజు మాట్లాడుతూ ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని అన్నారు. కామారెడ్డిలోని ఓల్డ్ ఎన్‌హెచ్ 7 రోడ్డుపై పట్టణ సీఐ నరేశ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తుండగా ఓ వ్యాపారి వద్ద 16 లక్షల 81 వేల 400 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. బాన్సువాడ మండలంలోని కొయ్యగుట్ట వద్ద సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఎండీ.ఫహీం తరలిస్తున్న రూ.2లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట పీఆర్ ఏఈ గోపి, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేందర్

సదాశివనగర్, అక్టోబర్ 20: సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ పేదలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ అండగా ఉంటున్నారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు మాయ మాటలతో ప్రజలను మోసం చేసేందుకు గ్రామాల్లో తిరుగుతున్నారని అన్నారు. సదాశివనగర్‌లో శుక్రవారం నిర్వహించిన సదాశివనగర్, రామారెడ్డి మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందినట్లు తెలిపారు. కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తుంటే.. వారంటీ లేని పార్టీలు గ్యారంటీలు ఇస్తూ ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నాయని, అలాంటి పార్టీలను ప్రజల నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తాను ఎల్లప్పుడూ నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి కార్యకర్త ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. పూటకో మాట చెప్పే పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి కండ్ల ముందు కనిపిస్తోందన్నారు.

**ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు**

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన 60 మంది మైనార్టీ యువకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహ్మద్ సాదిక్ అలీ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షఫీయొద్దీన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. సదాశివనగర్, కల్వరాల్, తుక్కోజివాడి, ఉత్తునూర్, లింగంపల్లి, కుప్రియాల్, రా మారెడ్డి, ఉప్పల్‌వాయి, గిద్ద, పోసానిపేట్ గ్రామాలకు చెందిన యువకులు పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే సురేందర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, రంగు రవీందర్ గౌడ్, ఎంపీపీలు అనసూయ, నారెడ్డి దశరథ్‌రెడ్డి, జడ్పీటీసీ నర్సింహులు, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు మోహినుద్దీన్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ నాయక్, అశోక్ రెడ్డి, పరమేశ్ గుప్తా, డోకురి రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాయిరెడ్డి, గడీల భాస్కర్, సాయాగౌడ్, భూంరెడ్డి, నారాయణరెడ్డి, రాజేశ్వర్ రావు, సాదక్‌అలీ, ఆకుల సిద్ధిరాములు, పైడి జనార్దన్, సర్పంచులు పాల్గొన్నారు.